**Sakshi**

# ఏపీపీఎస్సీ ఇంటర్వ్యూల్లో మార్పులు!

## అభ్యర్థుల నాయకత్వ లక్షణాల పరిశీలనకు ప్రాధాన్యం

**సాక్షి, హైదరాబాద్:** పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే ఇంటర్వ్యూల్లో అనుసరించాల్సిన విధివిధానాల్లో మార్పులు చేయాల్సిన అవసరముందని అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు అభిప్రాయపడుతున్నాయి. వివిధ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూల నిర్వహణ శాస్త్రీయంగా ఉండడంలేదని ఢిల్లీలో రెండ్రోజులపాటు జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యుల సదస్సు అభిప్రాయడింది. సదస్సుకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ దీపక్ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు సదస్సుకు హాజరైన ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహిస్తున్న వివిధ గ్రూపు పరీక్షల్లో ఇంటర్వ్యూల్లో అభ్యర్థులకు వేర్వేరుగా పాయింట్లు, మార్కులు రావడంపై చర్చ జరిగింది. ఒకే రకమైన ఇంటర్వ్యూలో అభ్యర్థులకు వచ్చే మార్కుల్లో వ్యత్యాసం ఉండడం సమంజసంగా లేదని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. ఇంటర్వ్యూలు చేసే సభ్యులు, ఇతర నిపుణుల ఇష్టాయిష్టాలు, వ్యక్తిగతాభిప్రాయాల మేరకు ఆయా అభ్యర్థులకు మార్కులు పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇంటర్వ్యూలకు స్పష్టమైన విధానం ఉండాలని సమావేశంలో చర్చ జరిగినట్లు ఉదయభాస్కర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగికి ఉండాల్సిన కనీస లక్షణాలున్నాయా? తన కింది సిబ్బందితో సమర్థంగా పనిచేయించే నాయకత్వ గుణాలున్నాయా? అంతిమంగా ప్రజాధనానికి రక్షకుడిగా అవి దుర్వినియోగం కాకుండా కాపాడగలిగే శక్తిసామర్థ్యాలు ఆయా అభ్యర్థుల్లో ఉన్నాయో లేవో అంచనా వేసే విధంగా ఇంటర్వ్యూలు ఉండాలని సమావేశంలో చర్చ జరిగినట్లు వెల్లడించారు. ఈ మేరకు విధివిధానాలు రూపొందించుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించారన్నారు.